క్లుప్తంగా

అన్నపూర్ణాదేవిగా గౌరమ్మ



గౌరమ్మకు నివేదించిన పిండివంటలు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు శనివారం కనువిందుగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా దీపావళి సందర్భంగా ఆదివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. పలు రకాల వంటకాలను నివేదించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిని దీపాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట ఏర్పాటు చేసిన దీపాలను వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి శరగడం మోహనరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పుస్తక ప్రదర్శన

సీతమ్మధార: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 14 నుంచి 20 వరకు నాటకాల సాహిత్య పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. రంగసాయి నాటక గ్రంథాలయంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాటకాలు, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విశాఖ ప్రజలు, నాటక అభిమానులు, బాలబాలికలు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

యువకుడి అదృశ్యం



గుల్షాన్

దాబాగార్డెన్స్: స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని దీపావళి రోజున వెళ్లిన ఓ యువకుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలివి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి టౌన్‌కొత్తరోడ్డు దరి లక్ష్మీశ్రీ నిలయంలో స్థానికంగా ఉంటున్న ఎస్.గుల్షాన్ ఓ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. దీపావళి పండగ రోజున స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన గుల్షాన్ తిరిగి ఇంటికి రాలేదు. తన వద్ద ఉన్న మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. గుల్షాన్ వద్ద రూ.500 మాత్రమే ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి హైదరాబాద్‌లోని లాజిస్టిక్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు.

బాసుదేవ్ ఆచార్య మృతి తీరని లోటు

దాబాగార్డెన్స్: ప్రముఖ పార్లమెంటేరియన్, సిటూ అఖిలభారత ఉపాధ్యక్షుడు బాసుదేవ్ ఆచార్య మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సిటూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు పేర్కొన్నారు. 1980 నుంచి 2014 వరకు పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన ఆయన కార్మికుల పక్షపాతి అని పేర్కొన్నారు. విశాఖలో బీహెచ్‌పీవీని ఎల్ అండ్ టీకి అప్పజెప్పే ప్రయత్నంలో పిటీషన్ కమిటీ చైర్మన్‌గా ప్రైవేటీకరణ కాకుండా నివారించారని తెలిపారు. బాసుదేవ్ ఆచార్య మరణం పీడిత ప్రజలు, కార్మిక వర్గానికి తీరని లోటని తెలిపారు. భార్య రాజ్యలక్ష్మి ఆచార్యకు, కుమారుడు, కుమార్తెలకు, సిటూ విశాఖ జిల్లా కమిటీ సానుభూతి తెలుపుతోందని ప్రకటనలో పేర్కొన్నారు.

వీజేఎఫ్ సభ్యత్వ రెన్యువల్ గడువు పొడిగింపు

అల్లిపురం: వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం (వీజేఎఫ్) సభ్యత్వ రెన్యువల్ గడువు కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 430 మంది సభ్యులు రెన్యువల్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు రెన్యువల్ దరఖాస్తును వెంటనే సమర్పించాలని కోరారు.

శివ పూజకు వేళాయె..

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- సిద్ధమైన శివాలయాలు



సూర్యాబాగ్‌లోని విశ్వేశ్వరాలయం



డీజీకే రైల్వే క్వార్టర్స్‌లోని భవానీ శంకర దేవాలయం

దాబాగార్డెన్స్/అల్లిపురం: శివాలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. సోమవారం సాయంత్రం ఆకాశదీపం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము 3గంటల నుంచి శివార్చనలు మొదలవుతాయని అర్చకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలో అస్సాంగార్డెన్స్, శివరామకృష్ణ దేవస్థానం, గోకుల్ థియేటర్ దరి రాజరాజేశ్వరి దేవాలయం, వెంకటేశ్వరమెట్ట, ఉమారామలింగేశ్వర దేవాలయం, కొబ్బరితోట పంచాయతన పంచముఖేశ్వర దక్షిణామూర్తేశ్వర దేవాలయం, సూర్యాబాగ్ విశ్వేశ్వరాలయం, వన్‌టౌన్ భీమేశ్వరాలయం, రామలింగేశ్వరాలయాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఈ ఏడాది నవంబర్ 14వ తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతోంది. ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11 తేదీల్లోని నాలుగు సోమవారాలతో పాటు 17న నాగులచవితి, 23న కార్తీక శుద్ధ ఏకాదశి, 26న కార్తీక పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీల ప్రతినిధులు తెలిపారు. డిసెంబర్ 13వ తేదీన పోలి పాడ్యమితో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయన్నారు.

భక్తుల సందడి

కార్తీకమాసం భక్తులకు ఎంతో ప్రీతికరం. వేకువజామున పూజలు, దేవాలయాల సందర్శన, సోమవారాలతో పాటు పౌర్ణమి రోజుల్లో ఉపవాసాలతో నెల రోజులూ సందడిగా ఉంటుంది. ఇక అయ్యప్ప దీక్ష తీసుకున్న మాలధారులతో అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. వేకువజామునే నిద్రలేచి, చల్లని నీటితో స్నానం చేసి, పీఠంలో ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వామి విగ్రహం/చిత్రపటాలకు నిష్ఠతో పూజలు చేయడం, రోజూ దేవాలయానికి వెళ్లిరావడం.. ఇలా నిత్యం నియమనిష్ఠలతో ఉండి, భక్తిశ్రద్ధలతో స్వామిని అర్చిస్తారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆకాశదీపం



ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు

దాబాగార్డెన్స్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో సోమవారం సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. అమ్మవారి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలోనూ ఆకాశదీపం వెలిగించే కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు ధనలత, వెంకటరత్నం, అనురాధ, సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

100వ సారి పదునెట్టంబడి ఆరోహణకు..



గజపతి స్వామి

దాబాగార్డెన్స్: 1985 నుంచి సుదీర్ఘంగా అయ్యప్ప స్వామి నిరంతర సేవలో ప్రయాణిస్తున్న బండారు గజపతి స్వామి(గురుస్వామి) ఇప్పటి వరకు 99 పర్యాయాలు పదునెట్టంబడిని ఆరోహణ చేసి 100వ సారి చేయనున్న సందర్భంగా స్వామి వివేకానంద సంస్థ అభినందనలు తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి దీక్షలు అందించిన గజపతి స్వామి మాలధారణ చేస్తూ, గృహాలు, గ్రామాల్లో పీఠాలు ఏర్పాటు చేస్తూ నిత్య సమారాధనలు, అంబలం పూజలు నిర్వహిస్తూ, అన్నదాన క్రతువులు సమీక్షిస్తూ వస్తున్నారు. స్వామి సన్నిధానం సందర్శనార్థం సముచిత రీతిన రవాణా ఏర్పాట్లు చేయడమే గాక పర్యవేక్షిస్తూ గజపతి స్వామి సహకరిస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



పేర్ల విజయచందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి, నాయకులు

అల్లిపురం: రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్‌ను 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వార్డు నాయకులు లింగం శ్రీనివాసరావు, లండారమణ, పిల్లి సత్తిబాబు, మేరుగు శ్రీను, వైట్, సత్తిరాజులు మర్యాపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి మరిన్ని మంచి పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

రహదారి మధ్యలో అనధికార పార్కింగ్



పూర్ణా మార్కెట్ వద్ద రహదారి మధ్యలో పార్క్ చేసిన వాహనాలు

జగదాంబ: పూర్ణా మార్కెట్ వద్ద అనధికార పార్కింగ్‌తో వినియోగదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ మార్కెట్ ఉంది. ఇక్కడ రహదారికి మధ్యలో పార్కింగ్ పెట్టడం వల్ల ఒక పక్క వ్యాపారులకు.. మరోపక్క వినియోగదారులకు తగాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలం కావడంతో ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. గతంలో ఇక్కడ రహదారికి ఒక పక్క మాత్రమే ద్విచక్ర వాహనాలు పార్క్‌చేసే వారని, ఇప్పుడు రోడ్డు మధ్యలో రెండో పక్క కూడా వాహనాలు నిలపడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కర్రి నీలకంఠం, రంధి గోపీ తదితరులు

అల్లిపురం: నియోజకవర్గంలో ఈ నెల 23న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, 33వ వార్డు కార్పొరేటర్ రంధి గోపీకృష్ణ కోరారు. నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కలసికట్టుగా ఉండి కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, వాటిని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జరుగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వార్డు నాయకులు ఎల్లంకి చిన్నమ్మలు, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, మేడం నారాయణరెడ్డి, భీశెట్టి రాజు, కణితి బ్రహ్మం, పిల్లి శివ పాల్గొన్నారు.

నేడు గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావును సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. పురస్కారంతో పాటు, నాలుగు రోజుల పాటు నిర్వహించే ఆకాశదీపం– కాశీఖండం ప్రవచన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మంగళవారం డాక్టర్ గరికిపాటి నరసింహారావును సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నారని తెలిపారు. అనంతరం బుధవారం నుంచి 17వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి ఆకాశదీపం– కాశీఖండంపై డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్టడీస్ పూర్వ విభాగాధిపతి డాక్టర్.పి.ఇందిర పాల్గొంటారన్నారు.

నేటి నుంచి పౌర గ్రంథాలయ వారోత్సవాలు



ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీ

సీతంపేట: ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు గ్రంథాలయ వ్యవస్థాపకుడు మట్టా వరహాలుశెట్టి చిత్రపట ఆవిష్కరణతో వారోత్సవాలు ప్రారంభవుతాయని చెప్పారు. 15వ తేదీ సాయంత్రం సహృదయ సాహితి సంస్థ కవి సమ్మేళనం, 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు విశాఖ సాహితి అఖిల భారతీయ సాహిత్య పరిషత్ క్విజ్ పోటీ, 17వ తేదీ సాయంత్రం విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో కథా రచయితల గోష్ఠి, 18వ తేదీ సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్‌చే వినోద వల్లరి, 19వ తేదీ ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చలన చిత్ర ప్రదర్శన, 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు గీత్ సంగీత్ మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి జరుగుతాయని తెలిపారు. సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శాస్త్రోక్తంగా ప్రత్యంగిరా భద్రకాళి హోమం



లలితా పీఠంలో హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: అమావాస్య సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో సోమవారం ఉదయం ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం లలితా పీఠంలో పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షణలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పీఠం ఆవరణలో దీపాలు వెలిగించి పూజలు చేశారు.

26న యదు మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

బీచ్ రోడ్డు: కార్తీక్ పౌర్ణమిని పురస్కరించుకుని పాలు, పెరుగు యదు మేళా ఉత్సవాన్ని ఈ నెల 26న గోకుల్ పార్క్ వద్ద నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవం పోస్టర్‌ను విశాఖ జిల్లా యాదవ్ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం బీచ్‌రోడ్డులోని గోకుల పార్క్‌లో ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆ రోజు యాదవ సామాజిక వర్గం ప్రముఖులతో సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బి.రామారావు, జి.రవికుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా ఎమ్మెల్యే

- పలువురికి వాసుపల్లి ఆర్థిక సాయం



అంతర్జాతీయ కరాటే పోటీలకు వెళ్తున్న దివ్య అంజలికి నగదు అందిస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో వైద్యసహాయం కోసం వచ్చిన అర్జీలపై స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వారికి ఆర్థిక సహకారం అందించారు. తన సొంత నిధుల నుంచి తొమ్మిది మందికి రూ.40వేలు అందజేశారు. 38వ వార్డు బుక్కావీధి ప్రాంతానికి చెందిన గుంటు సత్యవతి అనే మహిళకు, కందులవారి వీధికి చెందిన గొరక ఎల్లారావుకు, 39వ వార్డుకు చెందిన థాంసన్ వీధికి చెందిన కురమాన రెడ్డికి 5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. 33వ వార్డు అమ్మవారి వీధికి చెందిన మద్ది శంకర్‌రెడ్డికి రూ.5వేలు, ఇదే వార్డు అల్లిపురం వివేకానంద కాలనీకి చెందిన నీలాపు వాసంతికి రూ.5 వేలు, 27వ వార్డు డే అండ్ నైట్ హాస్పిటల్ రోడ్డులోని తనకాల అప్పల శ్రీనివాస్‌కు రూ.5వేలు అందించారు. 38వ వార్డు చిన్నమ్మలు వీధికి చెందిన బుంగ సత్తిరాజుకు రూ.2,500, 27వ వార్డుకు చెందిన కె.ఉదయకు రూ.2,500 అందజేశారు.

కరాటే క్రీడాకారిణికి..

అంతర్జాతీయ కరాటే పోటీలకు వెళ్తున్న 37వ వార్డు చెంగల్రావుపేటకు చెందిన వాసుపల్లి దివ్య అంజలికి ఎమ్మెల్యే రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు, జేసీఎస్ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

29వ వార్డులో కార్పొరేటర్ పర్యటన



ప్రజలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న కార్పొరేటర్ నారాయణరావు

మహారాణిపేట: నేను విన్నాను.. నేను ఉన్నాను అనే నినాదంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు అన్నారు. వార్డులోని సూర్యనగర్, ప్రకాశరావుపేట ప్రాంతాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. జీవీఎంసీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ పనుల వివరాలను తెలియజేశారు. పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్స్ అందిస్తున్న పీతల వాసు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దండుబజార్–1, ఆంథోనీనగర్, వెంకటపతిరాజు నగర్ ప్రాంతాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీతల వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి శంకర్ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్స్ అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు, నెరవేర్చినవి వివరిస్తూ సచివాలయ పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నీలాపు లక్ష్మి, బెవర మహేష్, ఆరుగుల రాజ్‌కుమార్, కోరాడ సురేష్, వై.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయ వసతి గృహాల్లో స్వచ్ఛ దీపావళి



భీమ్‌నగర్ వసతి గృహంలో స్వచ్ఛ దీపావళిలో నిరాశ్రయులు

అల్లిపురం: జీవీఎంసీ ఏయూటీడీ వసతి గృహాల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎస్‌ఆర్ కాంప్లెక్స్, భీమ్‌నగర్ ప్రాంతాల్లోని నిరాశ్రయ వసతి గృహాల్లో నిరాశ్రయులు స్వచ్ఛ దీపావళి జరుపుకున్నారు. టపాసులకు దూరంగా ఉండి ప్రమిదలు వెలిగించి పండగ చేసుకున్నారు. వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి వారితో కలిసి వేడుకలు నిర్వహించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- క్రైం ఏసీపీ వెంకటరావు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ వెంకటరావు తదితరులు

అల్లిపురం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు అన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు, క్రైం డీసీపీ గంధం నాగన్న సూచనలతో ఆయన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోటలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆధునిక సాంకేతికతతో సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తున్నాయని, వీటిని ప్రతీ వీధిలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు లోను కావద్దన్నారు. అలా ఎవరైనా మోసానికి గురైతే 100, టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఈస్ట్ క్రైం సీఐ చక్రధరరావు, టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీను, ఏఎస్ఐ అప్పారావు, హెచ్‌సీ హాఫీజ్, అర్జున్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఆర్ విభాగంలో ముగిసిన శిక్షణ



ప్రత్యేక శిక్షణ పొందుతున్న పరిశోధకులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్(ఎంఎల్‌ఆర్) విభాగంలో మైక్రో ప్లాస్టిక్స్‌పై నిర్వహిస్తున్న మూడు రోజుల వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర కాలుష్యం, ప్లాస్టిక్ ఫలితంగా ఏర్పడుతున్న దుష్పరిణామాలను వివరించారు. సముద్ర జీవులు, మానవ మనుగడకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్లాస్టిక్ కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూరోపియన్ కమిషన్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, ఆచార్య ఆర్.మాధవి, ఆచార్య కె.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డయాబెటిక్ రెటినోపతి పరీక్షలు నేడు

మద్దిలపాలెం : సీఎంఆర్ సెంట్రల్‌లో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఉచిత డయాబెటిక్ రెటినోపతి పరీక్షలు నిర్వహించనున్నామని ఆస్పత్రి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో 30 ఏళ్ల పైబడిన వారందరికి పరీక్షలు చేస్తామన్నారు. మధుమేహం బాధితులకు ఏమైనా కంటి చూపునకు సంబంధించి సమస్యలున్నాయో గుర్తించి సలహాలు ఇవ్వనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.